క్లుప్తంగా

సర్వేను వేగవంతం చేయాలి



సచివాలయ కార్యదర్శులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాలిటీలో సుడా ప్లానింగ్‌పై సర్వేను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, సచివాలయ ఉద్యోగులతో సమావేశమైన ఆయన సుడా రూపొందించిన ప్లానింగ్ ప్రకారం సర్వే చేయాలన్నారు. మాస్టర్ ప్లాన్ చిత్రాలను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద ప్రజల పరిశీలనకు వీలుగా ఉంచాలన్నారు. అలాగే పట్టణ వాసులకు ఈ ప్లానింగ్‌పై అభ్యంతరాలుంటే సెప్టెంబర్ 2వ తేదీలోగా కార్యాలయంలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టీపీవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌బీసీసీ జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ

బొండపల్లి(మెంటాడ): ప్రతిఒక్కరూ జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి, ఆరోగ్యం కాపాడుకోవాలని ఎస్‌బీసీసీ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల నిర్మూలన, రక్తహీనత నివారణ, జంక్‌ఫుడ్ వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయా అంశాలకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. రక్తహీనత బారినపడకుండా ఉండాలంటే జంక్‌ఫుడ్ తినకుండా ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే టోల్‌ఫ్రీ నంబర్ 112కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతో రైతులకు మేలు

తెర్లాం: పంటకోత ప్రయోగాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్, మండల సహాయ గణాంకాధికారి నారాయణరావు అన్నారు. శనివారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో పంటకోత ప్రయోగం, ఈ–క్రాప్ నమోదు తదితర అంశాలపై ఏఈవో, వీఏఏ, వీహెచ్‌ఏలకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పంటకోత ప్రయోగం ద్వారా పంట దిగుబడి తెలుసుకోవడంతో పాటు, పంట బీమా పొందవచ్చని, ఈ–క్రాప్ నమోదుతో ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన పంటలకు పంట నష్టపరిహారం పొందవచ్చని, అలాగే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటను సులభంగా అమ్ముకోవచ్చని తెలిపారు. అనంతరం పంటకోత ప్రయోగంను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌టీడీ జి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు అనుసరించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీ శ్యామసుందర్

బొబ్బిలి: వరి సాగులో యాజమాన్య పద్ధతులు అనుసరించాలని వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యామసుందరరావు అన్నారు. శనివారం మండలంలోని మెట్టవలస, అలజంగి గ్రామాల్లోని రైతులకు పంటల సాగుపై శిక్షణ ఇచ్చారు. విత్తనం నాటిన దగ్గర నుంచి పంట కోత వరకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



సమరభేరి వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం సమరభేరి కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు జరిగే సమరభేరిని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎస్.గోపాలం, ఎ.సురేష్, బి.యుగంధర్, బి.వెంకటరమణ, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



అంట్లవార గ్రామంలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని లింగాపురం, అంట్లవార గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సీఎం జగనన్నకు రెండు కళ్లు అని, ఓ వైపు సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతూనే మరో వైపు నిరంతరాయంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా అప్పటి జన్మభూమి కమిటీల సిఫార్సులు లేనిదే జరిగేవి కావన్నారు. ఇప్పుడు అలా కాదని అర్హుడై ఉంటే చాలని ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు వచ్చి చేరుతున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుని వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయన్నారు. గడిచిన ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని సీఎం జగన్ నెరవేర్చి, ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఇప్పుడు ఇస్తున్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే సీఎంని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బొబ్బిలి, తెర్లాం మండలాల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, నర్సుపల్లి బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, జెడ్పీటీసీ లూర్దు రామారావు, లింగాపురం సర్పంచ్ బూరాడ తవిటినాయుడు, మండల పార్టీ సీనియర్ నాయకులు టి.సత్యంనాయుడు, బి.అప్పలనాయుడు, ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మంయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాలు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం సిటీ: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటికి మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొడ్డవలస గ్రామంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు ప్రతీ గడపకు వెళ్లి, ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ఈ నాలుగున్నరేళ్ల కాలంలో జరిగిన లబ్ధిని వివరించారు. ప్రతీ పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే కాకుండా వారికి పథకాల రూపంలో ఆర్థికసాయం అందించి, ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రతీ ఇంటికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. ఈ రోజు ఏ గడపకు వెళ్లినా అదే ఆప్యాయత, అదే ఆదరణ లభిస్తుందని, ఈ ఆదరణను చూసిన ప్రతి పక్షానికి ఏం చేయాలో పాలుపోవడంలేదని అన్నారు. ఎక్కడికి వెళ్లినా తమకు లభిస్తున్న ఆదరణ చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల సేవలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. అయితే ఆయా వ్యవస్థలపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, వాటిని మానుకోవాలని హితవుపలికారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్ పొగిరి కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీరంగనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు వాకముళ్ల చిన్నారావు, మాజీ సర్పంచ్ జడ్డు జగదీష్, వైస్ ఎంపీపీలు ఎస్.వర్షిణి, వై.వెంకటేష్, వి.విజయ్‌కుమార్, ఎంపీడీఓ బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని జెడ్పీటీసీ బండి నర్సింహులు సూచించారు. మండలంలోని పెనుబాక గ్రామ సచివాలయం వద్ద పలు శాఖల అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో శనివారం సమావేశమైన ఆయన పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ఆరాతీశారు. పంచాయతీలోని అన్ని వీధులకూ సీసీ రోడ్లు, మురుగుకాలువలు నిర్మించడం జరిగిందని, జగనన్న కాలనీలో విద్యుత్, తాగునీరు సదుపాయాలు కల్పించామన్నారు. ఉపాధి హామీ పనులతో మంచినీటి కోనేరు బాగుచేసుకున్నామని, ఈ అభివృద్ధి అంతా ఈ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. వలంటీర్లు కూడా అర్హులకే సంక్షేమ పథకాలు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరరావు, పీఆర్ జేఈ ప్రభాకరరావు, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, ఏపీఓ సాయిరాం, ఏపీఎం దధికుమార్, సర్పంచ్ బండి బోడమ్మ, ఎంపీటీసీ బింగి కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



రామినాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని కంచరాం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామినాయుడును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత గెడ్డాపు సూరప్పడు ఇటీవల మృతి చెందగా, ఆయన కుమారుడు శ్రీనివాసరావును ఎమ్మెల్సీ కలిసి, పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ జి.అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో మెరుగైన ఆరోగ్యం

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఖండ్యాం ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేద వైద్యం ఎంతో ఉపయోగపడుతుందని, కీళ్లనొప్పులు, నడుమునొప్పి నివారణకు ఆయుర్వేదంలో మంచి మందులున్నాయన్నారు. చిన్నారులు, గర్భిణులకు వైద్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

ధ్యానంతో ఆరోగ్యం

రేగిడి: ధ్యానంతో ఆరోగ్యమని హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు అన్నారు. స్థానిక విశ్వసాయి మందిరంలో విద్యార్థులకు ఉచిత ధ్యాన యోగా తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధ్యానం ద్వారా ఆయుష్షును పెంచుకునే పద్ధతులను తెలిపారు.

తమ్మినాయుడు భౌతికకాయానికి ఎమ్మెల్యే నివాళి



తమ్మినాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మర్రాపు తమ్మినాయుడు భౌతికకాయానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు నివాళులర్పించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మర్రాపు జగన్నాథం సోదరుడైన తమ్మినాయుడు గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆస్ట్రేలియా నుంచి ఆయన కొడుకు వస్తున్న నేపథ్యంలో ఆయన భౌతికకాయం స్వగృహంలో ఉంచగా, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం అక్కడికి చేరుకుని, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతకుముందు తమ్మినాయుడు మృతదేహంపై పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ నాయకులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు ఉన్నారు. టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు(బేబీ నాయన), ఆ పార్టీ మండల నాయకులు కూడా తమ్మినాయుడు మృతదేహానికి నివాళులర్పించారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలి



బొబ్బిలి: సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



వంగర: గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

బొబ్బిలి: జగనన్న కాలనీల్లో సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన వార్డు సచివాలయ ఉద్యోగులతో సమావేశమై, లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలను వేగవతం చేయించాలని సూచించారు. ఈ నెల 30వ తేదీన వర్చువల్ విధానంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామూహిక గృహప్రవేశాలకు శ్రీకారం చుట్టనున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని తెలిపారు.

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో బాసూరి శంకరరావు శనివారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ సకాలంలో బిల్లులు, నిర్మాణ సామగ్రి, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నందున గృహ నిర్మాణాలను వేగవంతం చేసి, పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి బోడమ్మ, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని అరసాడ, వంగర ప్రాంతాల్లోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణాలను వేగవంతం చేయాలని, సకాలంలో నిర్మాణాలు చేపట్టిన వారికి బిల్లులు కూడా త్వరగా చెల్లిస్తామన్నారు. అంతకుముందు వంగర సచివాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఆయన వైఎస్సార్ చేయూత సర్వే పూర్తి చేయాలని, ఈకేవైసీ వేగవంతం చేయాలని, ఈ–క్రాప్ నమోదు చేపట్టాలని, పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలని సూచించారు.

మదర్‌థెరీసా సేవలు ఆదర్శం



వంగర: వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మదర్‌థెరీసా జయంతిలో సిబ్బంది



బొబ్బిలి: బొబ్బిలిలో మదర్‌థెరీసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాసరావు తదితరులు

వంగర: సేవామూర్తి మదర్‌థెరీసా పేదలకు చేసిన సేవలు ప్రపంచానికే ఆదర్శమని వంగర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మదర్‌థెరీసా జయంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి సిబ్బంది పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె చేసిన సేవలను కొనియాడారు. మానవత్వం, దయాగుణం, శాంతి, ప్రేమకు మారుపేరు అయిన మదర్ థెరీసా కోల్‌కతాలోని పేదల సంరక్షణకు తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. పరాయి దేశం నుంచి వచ్చి ఇక్కడి దేశానికి సేవ చేసిన మహనీయురాలు ఆమె అన్నారు. ఆమె సేవలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని విద్యార్థులను కోరారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఆర్‌సీఎం స్కూల్‌లో మదర్‌థెరీసా జయంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి సిబ్బంది పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మండపాక శ్రీనివాసరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పద్మావతి, రైతు సంఘ నాయకుడు వేమిరెడ్డి లక్ష్మంనాయుడు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు

రాజాం సిటీ: విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణను కూడా అలవర్చుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. శనివారం స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో జరిగిన న్యాయ అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తోటి వారితో స్నేహపూర్వకంగా మెలిగి, సోదరభావం పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థి దశలోనే గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. అలాగే మంచి అలవాట్లపై దృష్టిసారించి, అనుకున్న లక్ష్యం సాధించి, తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యాహక్కు చట్టం, ఉచితంగా న్యాయ సహాయం పొందే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.ఎస్.వి.బి.కృష్ణసాయితేజ, న్యాయవాదులు ఆర్.విజయ్‌కుమార్, సి.హెచ్.శ్యాంప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు



రామభద్రపురం: పోలీసులకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రామభద్రపురం: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా బహిరంగ సభల్లో విద్వేష పూరితంగా మాట్లాడుతున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుతో పాటు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ మరిపి శ్రీనివాసరావు నేతృత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. లోకేశ్ తన పాదయాత్రలో ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం రౌడీ రాజకీయాలను ప్రేరిపించడమేనని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో–కన్వీనర్ పత్తిగుళ్ల ఏక్‌నాథ్, సచివాలయ కన్వీనర్ నాగిరెడ్డి కామేశ్వరరావు, నాయకులు పతివాడ చంద్రశేఖర్, బొత్స కిశోర్, గంట నాగేశ్వరరావు ఉన్నారు. వంగర: సభలు, సమావేశాల్లో ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లంతా స్థానిక పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

సంతకవిటి: శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా లోకేశ్ తన పాదయాత్రలో ప్రజలను రెచ్చగొట్టి, మాట్లాడుతున్నారని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల సోషల్ మీడియా కన్వీనర్లు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.



సంతకవిటి: పోలీసులకు ఫిర్యాదుపత్రం అందజేస్తున్న సోషల్ మీడియా కన్వీనర్ గణపతినాయుడు



వంగర: పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా కన్వీనర్లు

సంక్షిప్తంగా...

చురుగ్గా సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే చాలా చురుగ్గా కొనసాగుతోంది. శనివారం గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కలిసి, ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు సకాలంలో, సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి

రేగిడి: పంటల సాగుకు సంబంధించి, ప్రతీ రైతు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చాటాయవలస, వన్నలి, అక్కన్నఅగ్రహారం, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లో చేస్తున్న ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించిన ఆయన ఈ–క్రాప్ నమోదు ద్వారా పంట విక్రయం సులభతరమవుతుందన్నారు. అలాగే పంటల బీమా పొందేందుకు వీలుంటుందన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆసిరినాయుడు సూచించారు. శనివారం మండలంలోని లచ్చారాయపురం గ్రామంలో మహిళలు, కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.

నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలి

బాడంగి: భూముల రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులకు సంబంధించి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని జేసీ మయూర్ అశోక్ ఆదేశించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో టెలీకాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ సిబ్బందితో మాట్లాడిన ఆయన భూముల రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్‌పై ఆరాతీశారు. ఈ మేరకు స్టోన్ ప్లాంటేషన్‌కు సంబంధించి, బాడంగిలో శతశాతం పూర్తి కాగా, ఆకులకట్టలో 70 శాతం, ముగడలో 50 శాతం పూర్తయిందని, కోడూరులో త్వరలో ప్రారంభించనున్నామన్నారు. మండలంలో మొత్తం 29 గ్రామాలకు గాను 24 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేసినట్లు తహసీల్దార్ అజురఫీజాన్ తెలిపారు.

కొప్పురలో 'నా భూమి–నా దేశం'

వంగర: మండలంలోని కొప్పుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో నా భూమి–నా దేశం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కిమిడి సన్యాసినాయుడు ప్రధానోపాధ్యాయుడు ఎం.సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ కరణం బాబూరావు పాఠశాల ఆవరణలో పలు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, పరిరక్షించాలని వారు కోరారు.

రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

రాజాం: మండలంలోని దోసరిలో రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. శనివారం ఈ పనులను పీఆర్ ఏఈ ప్రభాకరరావు పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపడుతున్నామన్నారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

వంగర: మండలంలోని కె.కొత్తవలస గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు వేమకోటి రమాకాంత్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేకాభిషేకాలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

రాజాం: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని రాజయ్యపేట, అంతకాపల్లి, కంచరాం తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శనివారం సందర్శించిన ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపై ఆరాతీశారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు.

మండల ప్రత్యేకాధికారిగా మెప్మా పీడీ

రేగిడి: మండల ప్రత్యేకాధికారిగా మెప్మా పీడీ బి.సుధాకర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన పలు శాఖల అధికారులతో పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఓటర్ సర్వే సక్రమంగా చేపట్టి, పక్కా ఓటరు జాబితా తయారు చేయాలని సూచించారు. అనంతరం ఆమదాలవలస సచివాలయ పరిధిలో బీఎల్‌వో తొలగించిన ఓటర్ల వివరాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, తహసీల్దార్ కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్యపరీక్షలు

రామభద్రపురం: స్థానిక శ్రీరామ్‌నగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏఎల్‌జీ శిరీష మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని, సామ్–మామ్ ద్వారా చిన్నారుల ఆరోగ్యం తనిఖీ చేసి, వైద్యం అందేలా చూస్తున్నామన్నారు.